సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 9 । నవంబర్ । 2023



నాణ్యమైన మిరియంతో ఆదాయం

మిరియాలను నాణ్యంగా తయారు చేసుకుని అమ్మడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చని శాస్త్రవేత్తలు సూచించారు. IIలో



150 కిలోల గంజాయి స్వాధీనం

ముంచంగిపుట్టు మండలంలో 150 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేశారు. IIలో



ఘనంగా నిత్య కల్యాణం

సింహాచలం సింహగిరిపై స్వామి వారి నిత్య కల్యాణం బుధవారం కన్నుల పండువగా జరిగింది.

న్యూస్‌రీల్

నేటి నుంచి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

అరకులోయ టౌన్: రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు ఈనెల 9వ తేదీ గురువారం నుంచి నిర్వహి ంచనున్నట్లు పీడీ, జిల్లా ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి పి. సూరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. అరకులోయ మండలంలోని కంతభ ంసుగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగే పోటీల్లో రాష్ట్రంలోని పలు పాఠశాలల నుంచి వాలీబాల్ క్రీడాకారులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కొయ్యూరు: మూడు వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంపీడీవో లాలం సీతయ్య బుధవారం తెలిపారు. రాజేంద్ర పాలెం క్లస్టర్ 11, 13లో రెండు పోస్టులు, రేవళ్ల, మూలపేటలో ఒకొక్క దానికి దరఖాస్తులను ఈనెల పదో తేదీలోగా అందజేయాలన్నారు. 13న దరఖాస్తుల పరిశీలన, 14న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎంపికై న వారు ఒక్క రోజు శిక్షణ అనంతరం 17న విధుల్లో చేరాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలకు అరకు స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు



బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మూర్తి, కోచ్

అరకులోయ టౌన్: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 బ్యాడ్మింటన్ పోటీల్లో అరకులోయ స్పోర్ట్స్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు పాల్గొంటున్నట్లు స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో నిర్వహించే పోటీలకు ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల క్రీడా పాఠశాల విద్యార్థులు వి. అజిత్ కుమార్, పి.గౌతమ్ ఎంపికయ్యారని ఆయన పేర్కొన్నారు. ప్రిన్సిపాల్, కోచ్ కె. రాజుబాబు విద్యార్థులను అభినందించారు.

తాజంగి వైద్యాధికారిగా భవాని



చింతపల్లి రూరల్: మండలంలోని తాజంగి పీహెచ్‌సీ వైద్యాధికారిగా జి.భవాని బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన డాక్టర్ సావిత్రి పీజీ ట్రైనింగ్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

గోదావరిలో వ్యక్తి గల్లంతు

దేవీపట్నం: మండలంలోని పోశమ్మగండి వద్ద గోదావరిలో బుధవారం సాయంత్రం సమయంలో గుర్తు తెలియని వ్యక్తి గల్లంతయ్యాడు. అతని వయసు సుమారుగా 50 సంవత్సరాలు పైబడి ఉంటుందని స్థానికులు తెలిపారు. స్నానానికి దిగి ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడా లేక ఆత్మహత్యకు యత్నించాడా అనేది తెలియాల్సి ఉంది. అతనికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్‌ఐ కేవీ నాగార్జున తెలిపారు. గురువారం ఉదయం గాలింపు చర్యలు చేపడతామని ఆయన తెలిపారు.

దిశ యాప్‌పై అవగాహన



దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసి చూపిస్తున్న విద్యార్థినులు

అరకులోయ టౌన్: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం దిశ యాప్‌పై మహిళా పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ అధ్యక్షురాలు పి. సుందరిరాణి మాట్లాడారు. ప్రతీ విద్యార్థిని మొబైల్‌లో దిశ యాప్ ఉండాలన్నారు. మహిళా పోలీసు జె.పద్మ మాట్లాడుతూ దిశ యాప్ వినియోగం, ప్రయోజనాలను వివరించారు. విద్యార్థినులతో దిశ యాప్ లోడ్ చేయించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భరత్ కుమార్ నాయక్, డాక్టర్ సీహెచ్ రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ సభ్యులు వై. విజయలక్ష్మి, ఎం. అనిత కుమారి, జి. సంధ్య, ఎస్. అన్నపూర్ణ, మహిళా పోలీసులు కె.ప్రియాంక, జెఎం. జ్యోతి, టి. కాంతమ్మ, ఎస్. రాజేశ్వరి, భవాని పాల్గొన్నారు.

959 గ్రామాలకు శుద్ధ జలం

ఒకొప్పుడు గుక్కెడు తాగునీటి కోసం కిలోమీటర్ల కొద్దీ వెళ్లాల్సిన పరిస్థితి.. ఇప్పుడు ఇంటి ముంగిటే కుళాయిలు.. అందుబాటులో శుద్ధ జలాలు.. జల్‌జీవన్ మిషన్ పథకంలో 959 గ్రామాల్లో సురక్షిత తాగునీరు పుష్కలంగా అందుబాటులోకి రావడంతో వాగులు, గెడ్డలను ఆశ్రయించాల్సిన పరిస్థితి తప్పింది.

- పూర్తయిన జల్‌జీవన్ మిషన్ పథకం తొలి దశ పనులు
- 2,595కు గాను రూ.12620.19 లక్షల కేటాయింపు
- ఇంటి ముంగిటే కుళాయిలు
- గిరి పల్లెల్లో ఆనందం



జి.మాడుగుల మండలం గొడ్డలికర్రలో తాగునీరు పట్టుకుంటున్న ఆదివాసీ మహిళలు



జి.మాడుగుల మండలం ఉల్లివరపాడులో తాగునీటిని పట్టుకుంటున్న ఆదివాసీ మహిళలు

సాక్షి,పాడేరు: జిల్లాలోని గిరిజనులకు జల్‌జీవన్ మిషన్ పథకం వరంలా మారింది. ఇంటింటికి కుళాయిల ద్వారా సురక్షిత తాగునీరు అందుబాటులోకి వచ్చింది. 24గంటల పాటు నిరంతరం తాగునీరు ఇంటి ముంగిటే పుష్కలంగా ఉండడంతో గిరిజనుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

సమృద్ధిగా తాగునీరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా జల్ జీవన్ మిషన్ పథకాన్ని అమలు చేస్తున్నాయి. ఇంటింటికీ తాగునీరు అందించే లక్ష్యంతో తొలిదశలో రెండేళ్ల క్రితం 959 గ్రామాల్లో 2,595 పనులకు 12620.19 లక్షలు కేటాయించింది. రూ.5లక్షల నుంచి రూ.10లక్షల లోపు తాగునీటి పథకాల పనులను కాంట్రాక్టర్లు పూర్తి చేశారు. వృథాగా ఉన్న తాగునీటి పథకాలకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తెచ్చారు. అవసరమైన చోట ట్యాంకుల నిర్మాణం చేపట్టి తాగునీటి సమస్య పరిష్కరించారు. ఆయా గ్రామాల్లో తాగునీరు సమృద్ధిగా అందుతోంది.

తప్పిన అవస్థలు

జలజీవన్ మిషన్ పథకంలో 959 గ్రామాల్లో తాగునీటి పథకాల పనులు పూర్తి కావడంతో గిరిజనులకు అవస్థలు తప్పాయి. స్థానికంగా కుళాయిలు అందుబాటులో లేనప్పుడు కొండవాగులు, గెడ్డలు, ఊట నీటిని తాగి అనారోగ్యానికి గురయ్యేవారు. ఇప్పుడు తాగునీటి పథకాలు అందుబాటులోకి రావడంతో గ్రామాల్లో ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొంది.

పూర్తయిన తాగునీటి పథకాల వివరాలు

ఆర్‌డబ్ల్యూఎస్ సబ్‌డివిజన్	పనుల సంఖ్య	నిధులు (రూ.లక్షల్లో)
పాడేరు	461	1,461.39
అనంతగిరి	404	1,318.29
పెదబయలు	560	1,356.05
చింతపల్లి	549	3,557.79
అడ్డతీగల	273	1,911.77
రంపచోడవరం	202	1,874.95
చింతూరు	621	4,926.22

కలుషిత నీటి నుంచి విముక్తి



గతంలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. గెడ్డనీటిని తాగడం వల్ల వ్యాధులు సోకేవి. ప్రభుత్వం తాగునీటి పథకాలు నిర్మించి ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటుచేసి తాగునీరు అందిస్తోంది. దీనివల్ల అవస్థలు తప్పాయి. తాగునీటి కష్టాలు గట్టెక్కాయి. – చిలకమ్మ, నిట్టమామిడి, గడుతూరు పంచాయతీ, జి.మాడుగుల మండలం

విజయవంతంగా పనులు పూర్తి

జిల్లాలోని 959 గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పథకంలో శుద్ధ జలాలు అందుబాటులోకి వచ్చాయి. అంతకు ముందు గిరిజనులు వాగులు, గెడ్డల నీటిని ఆశ్రయించే వారు. ఇప్పుడు వారి ఇంటి ముంగిటకే కుళాయిలు ఏర్పాటుచేయడం వల్ల వారిలో ఆనందం నెలకొంది. మొదటి దశలో పనులను విజయవంతంగా పూర్తి చేశాం. – లీలాకృష్ణ, ఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, పాడేరు

అర్హులకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్

- తెల్ల రేషన్ కార్డు తప్పనిసరి
- ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలో ప్రాంతంలో ఇప్పటి వరకు ఎటువంటి గ్యాస్ ఏజెన్సీల ద్వారా గ్యాస్ కనెక్షన్ తీసుకోని వారు ఉచితంగా కనెక్షన్ పొందవచ్చని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన ద్వారా ఉచితంగా కొత్త గ్యాస్ కనెక్షన్ పొందవచ్చన్నారు. ఇందుకు తెల్లరేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. కుటుంబ యజమానురాలు, తమ కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, బ్యాంకు అకౌంటు, రేషన్ కార్డు, నివాసం ఉంటున్న ఇంటి అడ్రస్‌కు సంబంధించిన ధ్రువపత్రాలు జెరాక్స్ కాపీలతో దగ్గరలో గ్యాస్ ఏజెన్సీని సంప్రదించాలన్నారు. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన కొత్త గ్యాస్ కనెక్షన్ దరఖాస్తును సంబంధిత డాక్యుమెంట్లు ధ్రువపత్రాలు, రెండు ఫొటోలు జతపరచి అందజేసి ఉచితంగా కనెక్షన్ పొందవచ్చన్నారు.

రేపు కొయ్యూరులో జగనన్నకు చెబుదాం

సాక్షి,పాడేరు: కొయ్యూరు మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 10వతేదీ శుక్రవారం జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జరుగుతుందన్నారు. మండలంలో ప్రజలు ఈప్రత్యేక స్పందనను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్నిశాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. స్పందన ముగిసిన అనంతరం ఆయా శాఖల సిబ్బందితో అధికారులు సమావేశాలు నిర్వహించాలన్నారు. పాడేరు ఐటీడీఏలో శుక్రవారం జరగాల్సిన స్పందన రద్దు చేశామని ఆయన తెలిపారు.

గిరిజనాభివృద్ధే లక్ష్యం కావాలి





మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకర్‌రావు,చిత్రంలో ఐటీడీఏ పీవో అభిషేక్, సమావేశానికి హాజరైన అధికారులు

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకర్‌రావు
- ఐటీడీఏలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష

పాడేరు రూరల్ : గిరిజనాభివృద్ధే అధికారుల లక్ష్యం కావాలని అందుకు అనుగుణంగానే సేవలు అందించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకర్‌రావు ఆదేశించారు. రెండు రోజుల ఏజెన్సీ పర్యటనలో భాగంగా బుధవారం ఆయన ఐటీడీఏ సమావేశ మందిరంలో పలు శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో నకిలీ కుల ధ్రువీకరణ పత్రాల నిర్మూలనకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏజెన్సీలో ప్రధాన సమస్య అయిన రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని అధికంగా వినతులు వస్తున్నాయన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని రకాల పథకాలు ప్రజలకు సకాలంలో సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏజెన్సీలో చేపడుతున్న గృహ నిర్మాణ పథకాలు, ఉపాధి హామీ పథకం, ఇంజనీరింగ్ పనులు, డ్రైనేజీల నిర్మాణాలు, వైద్యారోగ్య సేవలు, అంగన్‌వాడీ సేవలు, గిరిజనుల అక్షరాస్యత, విద్య సదుపాయాలు, తదితర వివరాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు. పాడేరు, అరకు నియోజకవర్గాల్లో గిరిజన జనాభా, అక్షరాస్యత, విద్యా, వైద్య సేవలు, పర్యాటక అభివృద్ధి, కాఫీ ప్రాజెక్టు అమలు తదితర విషయాలను ఐటీడీఏ పీవో అభిషేక్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రధానమంత్రి ఆది గ్రామ ఆదర్శ యోజనలో 220 గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. ప్రధానమంత్రి పీవీటీజీ మిషన్ అమలు, రోడ్ల నిర్మాణాలు, గిరిజన యువతకు ఐటీడీఏ అందిస్తున్న ఉచిత సివిల్స్ శిక్షణ తరగతుల అంశాలను అభిషేక్ వివరించారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఏఎస్పీ ధీరజ్, ఐటీడీఏ ఏపీవోలు ప్రభాకర్‌రావు, వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు, గిరిజన సంక్షేమ శాఖ ఈఈలు డీవీఆర్ఎం రాజు, వేణుగోపాల్, గృహ నిర్మాణ శాఖ ఈఈ బాబు, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, కొర్రా రామలక్ష్మి, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు పాల్గొన్నారు.



లింగాపుట్టులో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్‌రావ

గిరిజనులకు అండగా ఎస్టీ కమిషన్



మోదకొండమ్మ తల్లిని దర్శించుకునేందుకు వస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్‌రావు



గిరిజన చిన్నారులతో ముచ్చటిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్

సాక్షి,పాడేరు: గిరిజనుల సమస్యలు పరిష్కారమే ఆజెండాగా గిరిజనులకు ఎల్లవేళలా అండగా ఎస్టీ కమిషన్ అండగా నిలుస్తుందని ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డి.వి.జి.శంకరరావు అన్నారు. బుధవారం ఆయన స్థానిక మోదకొండమ్మతల్లి ఆలయాన్ని సందర్శించారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలంనాయుడు స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధర్యంలో ఆయనతోపాటు సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రామలక్ష్మిలను సత్కరించారు.

జిల్లా ఆస్పత్రి సందర్శన

జిల్లా ఆస్పత్రిలోని గైనిక్ విభాగాన్ని ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్‌రావు సందర్శించారు. గర్భిణులతో మాట్లాడారు. ప్రతి నెలా వైద్యపరీక్షలతో పాటు ఆస్పత్రిలోనే కాన్పులు జరుపుకోవాలని సూచించారు. అక్కడ నుంచి శ్రీకృష్ణాపురం బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థినులకు వైద్యసిబ్బంది చేపట్టిన హెచ్‌బీ రక్తపరీక్షలను పరిశీలించారు.అక్కడ నుంచి నేరుగా లింగాపుట్టు గ్రామానికి చేరుకున్నారు.గిరిజనులంతా పూలమాలలు వేసి స్వాగతం పలికారు. అనంతరం వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పదేళ్ల క్రితం లింగాపుట్టును సందర్శించడంతో ఈ గ్రామానికి ఎంతో ప్రాధాన్యం ఏర్పడిందన్నారు. కమిషన్ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి గిరిజనులకు సేవలందిస్తానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తోందని, విద్య, వైద్య రంగాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిందన్నారు. గిరిజన మహిళలు అన్ని రంగాల్లో చైతన్యవంతులు కావాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు, తహసీల్దార్ త్రినాథనాయుడు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు మత్స్యరాస వెంకటలక్ష్మి, పలు సంఘాల నాయకులు తెడబారికి సురేష్‌కుమార్, కిముడు విశ్వ తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరంలో భారీ వర్షం



కురుస్తున్న వర్షం

వై.రామవరం: మండలంలో బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు రెండున్నర గంటలసేపు కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మలు విరిగిపడి సాంకేతికలోపం తలెత్తి సరఫరా నిలిచిపోయింది.

నేడు రక్తదాన శిబిరం

సాక్షి,పాడేరు: స్థానిక కలెక్టరేట్ సమావేశమందిరంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ జిల్లా అధ్యక్షుడు బి.చిన్నికృష్ణ తెలిపారు. రెవెన్యూ ఉద్యోగులతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, సాధారణ ప్రజలు కూడా రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చి ఈ శిబిరాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే..

- నేటి నుంచి గ్రామాల్లో విస్తృత ప్రచారం
- నాలుగున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తాం
- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

పాడేరు రూరల్ : రాష్ట్రానికి మళ్లీ జగనే ఎందుకు సీఎం కావాలనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి విస్తృత ప్రచారం నిర్వహిస్తామని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో పొందుపర్చిన అంశాలను రాష్ట్ర ప్రభుత్వం శతశాతం అమలు చేసిందన్నారు. గత ప్రభుత్వం రేషనలైజేషన్ పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూయించి నారాయణ వంటి కార్పొరేట్ విద్యాసంస్థలకు మేలు చేకూర్చిందన్నారు. పాడేరులో ఏకంగా రూ.500 కోట్లతో వైద్య కళాశాల నిర్మాణం చరిత్రాత్మకమన్నారు. గత టీడీపీ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల కోసం రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయ యాంత్రీకరణ, రైతు భరోసా వంటి పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా మారుమూల గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందాయన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ఓర్వలేక టీడీపీ, బీజేపీ, జనసేన పనికిమాలిన విమర్శలు చేస్తున్నాయన్నారు. ప్రశ్నిస్తానని రాజకీయ పార్టీని ఏర్పాటు చేసిన పవన్ కల్యాణ్ టీడీపీ, బీజేపీ పార్టీలకు తొత్తుగా మారారన్నారు. రియల్ హీరో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం నుంచి పల్లె బాట నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. గ్రామాల్లో చేకూరిన లబ్ధి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాల వివరాలను పొందుపర్చుస్తూ బోర్డులు ఏర్పాటుచేస్తామన్నారు. ప్రతీ గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరించి స్థానిక గిరిజనులతో సహపంక్తి భోజనాలు చేసి వారికి భరోసా కల్పించేందుకు పార్టీ శ్రేణులు ఆ గ్రామంలోనే రాత్రి బస చేస్తారన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, సర్పంచ్‌లు వంతాల రాంబాబు, గొల్లోరి నీలకంఠం, వనుగు బసవన్నదొర, ఎంపీటీసీలు గిడ్డి విజయలక్ష్మి, దసురి సన్యాసిరావు, రామకృష్ణపాత్రుడు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు పి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాణ్యమైన మిరియంతో ఆదాయం

- కర్ణాటక ఐసీఆర్ఐ శాస్త్రవేత్త కేఎన్ హర్ష

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో గిరిజన రైతులు కాఫీతోటల్లో అంతరపంటగా సాగుచేస్తున్న మిరియాలను నాణ్యంగా తయారు చేసుకొని మార్కెటింగ్ చేయడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధ్యమని కర్ణాటక ఐసీఆర్ఐ శాస్త్రవేత్త డాక్టర్ కె.ఎన్.హర్ష, చింతపల్లి ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ వి.శివకుమార్ సూచించారు. మిరియాల సాగులో నూతన పద్ధతులు, పంట సేకరణ, మార్కెటింగ్ తదితర అంశాలపై స్పైసెస్ బోర్డు ఆధ్వర్యంలో బుధవారం వ్యవసాయశాఖ అనుబంధ విభాగాల అధికారులకు కలెక్టరేట్‌లో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ మిరియంలో అధిక దిగుబడి, మెరుగైన ఆదాయమే లక్ష్యంగా గిరిజన రైతులను ప్రోత్సహించాలన్నారు. ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ జాతీయ ప్రాజెక్టు మేనేజర్ వినయ్‌సింగ్, నాణ్యత నిర్ధారణ పరీక్ష కేంద్రం శాస్త్రవేత్త కె.వి.సౌమ్య, స్పైసెస్ బోర్డు ప్రతినిధి మాలిని, ఫీల్డ్ అధికారి కల్యాణి, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులు నందు, రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సుల భర్తీకి రెండో విడత కౌన్సెలింగ్‌కు సన్నాహాలు

మహారాణిపేట: స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి త్వరలో రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. విజయనగరం మెడికల్ కళాశాలలో 80 పోస్టులు, వైద్య విధాన పరిషత్‌లో ఆరు పోస్టుల భర్తీకి మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించి.. 60 మందికి పోస్టింగ్ ఇచ్చారు. ఏడు పోస్టుల్లో కోవిడ్ వెయిటేజ్ మార్కుల స్పష్టత కోసం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు రీజినల్ డైరెక్టర్ డాక్టర్ బి.సుజాత లేఖ రాశారు. దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కాగా.. తుది జాబితాలో ఎంపికైన 11 మంది అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కాలేదు. ఐదుగురు పోస్టింగ్ వద్దని లేఖ ఇచ్చినట్లు ఆర్డీ డాక్టర్ సుజాత తెలిపారు. పోస్టింగ్ ఇచ్చిన 60 మందిలో ఎంత మంది విధుల్లో చేరుతారో తెలియని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ఖాళీలన్నీ క్రోడీకరించి రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

నలుగురు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

సాక్షి, అనకాపల్లి: పరవాడ సంతలో ఆర్మీ ఉద్యోగితో ఘర్షణ సందర్భంగా అనుచితంగా ప్రవర్తించిన నలుగురు పరవాడ పోలీసులను సస్పెండ్ చేస్తూ ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఏఆర్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ఎస్పీ బుధవారం వారిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఆర్మీ ఉద్యోగి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుకు చింతిస్తున్నామని తెలియజేస్తూ.. అందుకు బాధ్యులైన పోలీస్ సిబ్బందిపై కఠిన చర్య తీసుకున్నట్టు ఎస్పీ మురళీకృష్ణ పేర్కొన్నారు.

జగన్ నాయకత్వానికి విశేష ఆదరణ

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు
- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం



వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, నాయకులు

సాక్షి,పాడేరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వానికి ప్రజల్లో విశేష ఆదరణ ఉందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. పెదబయలు మండలం అడుగులపుట్టు పంచాయతీ సింధిపుట్టులో టీడీపీకి చెందిన సర్పంచ్ కొర్ర వరహాలమ్మ, పలు పార్టీల నాయకులు, వార్డు సభ్యులు కొర్రా నూకరాజు, సురేష్, రంగారావు, కామేశ్వరరావు, బాబూరావు, మర్రి కుంభి,నాగన్న తదితర 86 కుటుంబాలకు చెందిన గిరిజనులు బుధవారం ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ చరిత్రలో నిలిచిపోయేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారన్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్య రంగాలను బలోపేతం చేయడంతో పాటు పేదరిక నిర్మూలన లక్ష్యంతో సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారన్నారు. మారుమూల గ్రామాలకు రోడ్లు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. గిరిజన ప్రాంత అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమనే నమ్మకంతో పలు రాజకీయ పార్టీల నాయకులు, గిరిజనులు ఉన్నారని ఆయన తెలిపారు. ఎంపీపీ వరహాలమ్మ, జెడ్పీటీసీ కూడా బొంజుబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు వంతాల ఆనందరావు, మాజీ జెడ్పీటీసీ గంగాభవాని, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కాతరి సురేష్‌కుమార్, పలు పంచాయతీల సర్పంచ్‌లు వంతాల చిన్నారావు, పాంగి సింహాచలం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఏపీకి జగన్ ఎందుకు కావాలో తెలియజేద్దాం

ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



మాట్లాడుతున్న ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి జగనన్న మళ్లీ ఎందుకు కావాలో ప్రజలకు తెలియజేద్దామని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఏపీలో అభివృద్ధి జరిగిందన్నారు. నవరత్నాలు పేరిట ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి ప్రారంభం కానున్న వై ఏపీ నీడ్ జగన్ అనే కార్యక్రమంలో ప్రతి కార్యకర్త భాగస్వామికావాలన్నారు. వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఓటు వేయాలని ప్రజలను కోరే హక్కు కేవలం మన కార్యకర్తలకు ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో 34,108 ప్రభుత్వ ఉద్యోగాలను కల్పిస్తే మన జగనన్న ప్రభుత్వం నాలుగేళ్లలో 4.93 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో మన అందరి టార్గెట్ 175 అని ఆమె కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి మల్లికార్జున్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరబీరు జగబంధు, సర్పంచులు రమేష్, నీలకంఠం, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

పర్యాటకానికి 'హరిత' హారం

- హరితా హోటల్ యాత్రీ నివాస్ ఆధునికీకరణ
- రూ.5.08 కోట్లతో పనులకు ఏపీటీడీసీ శ్రీకారం



పర్యాటక శాఖకు చెందిన హరిత నివాస్

సాక్షి, విశాఖపట్నం : అందాల విశాఖ జిల్లా.. పర్యాటక రంగంలో కొత్త పుంతలు తొక్కుతోంది. ప్రకృతి రమణీయతతో దేశ విదేశీ సందర్శకులకు స్వర్గధామంగా మారింది. ఏటా విశాఖకు వచ్చే పర్యాటకుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. కొత్త పర్యాటకుల అభిరుచులకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా బీచ్‌రోడ్డులో ఉన్న హరిత హోటల్ యాత్రీనివాస్ భవనాన్ని రూ.5.10 కోట్లతో ఆధునికీకరించాలని నిర్ణయించింది. హరిత హోటల్‌లో ఎక్కువగా పశ్చిమబెంగాల్, ఒడిశాతో పాటు ఉత్తర భారతదేశానికి చెందిన పర్యాటకులు బస చేస్తుంటారు. టూరిజం ప్యాకేజీలో వచ్చే టూరిస్టులకు హరిత హోటల్ డెస్టినీగా ఉంది. అందుకే అత్యాధునిక సౌకర్యాలతో యాత్రినివాస్‌ని సుందరీకరణ పనులు చేపడుతున్నారు.

స్పెషల్ ఎట్రాక్షన్‌గా పార్టీ జోన్

అప్పుఘర్‌లో బీచ్ వ్యూలో హరితా హోటల్ యాత్రి నివాస్ ఉంది. మొత్తం 4 అంతస్తుల భవనంలో 46 గదులు, రెస్టారెంట్ ఉంది. 25 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో గదుల్లో లీకేజీలు ఏర్పడ్డాయి. కొన్ని చోట్ల పెచ్చులూడుతున్నాయి. భవిష్యత్తులో పర్యాటకుల తాకిడి మరింత పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్న నేపథ్యంలో యాత్రి నివాస్‌ను సుందరీకరించేందుకు ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీటీడీసీ) టెండర్లు ఆహ్వానించింది. రూ.5.08 కోట్లకు ఏపీ కన్‌స్ట్రక్షన్ అండ్ కో సంస్థ ఈ పనుల టెండర్లను దక్కించుకుంది. నాలుగు నెలల్లోగా పనులు పూర్తి చేసి అందించేందుకు అగ్రిమెంట్ కూడా కుదుర్చుకుంది. సుందరీకరణలో భాగంగా ముందు భాగంలో ఉన్న బాల్కనీని కుదించి.. గదుల విస్తీర్ణం పెంచనున్నారు. లాంజీని పెంచి.. వెయింటింగ్ హాల్ ఏర్పాటు చేయనున్నారు. కొత్త లిఫ్టులు రానున్నాయి. టెర్రస్‌పై స్పెషల్ అట్రాక్షన్‌గా కొత్తగా పార్టీ జోన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులను నాలుగు నెలల్లో పూర్తి చేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొస్తామని ఏపీటీడీసీ ఇంజినీరింగ్ అధికారి రమణప్రసాద్ తెలిపారు. బీచ్‌రోడ్డులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా హరిత హోటల్ భవన సుందరీకరణ పనులు డిజైన్ చేశామని వెల్లడించారు. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయని రమణప్రసాద్ వివరించారు.

కనకమహాలక్ష్మి హుండీల ఆదాయం రూ.38.20 లక్షలు

డాబాగార్డెన్స్: కనక మహాలక్ష్మీ దేవస్థానంలో బుధవారం హుండీల ఆదాయం లెక్కించగా.. రూ.38,20,413 వచ్చింది. సెప్టెంబర్ 11 నుంచి ఈ నెల 8వ తేదీ వరకు హుండీల ద్వారా వచ్చిన ఆదాయం, కానుకలు లెక్కించినట్లు ఈవో కె.శిరీష తెలిపారు. నగదుతో పాటు 116 గ్రాముల 500 మిల్లీ గ్రాముల బంగారం, కిలో 25 గ్రాముల వెండి, 134 అమెరికన్ డాలర్లు, 100 ఒమానీ రియాల్స్ వచ్చాయి. ధర్మకర్తల మండలి సభ్యులు సత్యరూపవాణి, ధనలత, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, వసంతకుమార్, లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

150 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరు అరెస్టు..ఐదుగురు పరార్
- నగదు, సెల్‌ఫోన్లు, జీపు స్వాధీనం

ముంచంగిపుట్టు: మండలంలోని కుమడ పంచాయితీ కేంద్రంలో మూడు రోడ్ల జంక్షన్ వద్ద 150 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ రవీంద్ర తెలిపారు. మరో ఐదుగురు తప్పించుకున్నట్టు ఆయన పేర్కొన్నారు. గంజాయిని తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు మండలంలోని కుమడ పంచాయతీ కేంద్రం మూడు రోడ్ల జంక్షన్ వద్ద బుధవారం ఉదయం పోలీసులు తనిఖీలు చేపట్టారు. బూసిపుట్టు నుంచి కుమడ జంక్షన్ వైపు వస్తున్న జీపును నిలిపారు. ఇంతలో కొంతమంది వ్యక్తులు దిగి పారిపోతుండగా వారిని పోలీసులు వెంబడించారు. ఏడుగురిలో ఇద్దరు వ్యక్తులను పట్టుకోగలిగారు. మిగతా ఐదుగురు పరారయ్యారు. వెంటనే జీపును తనిఖీ చేయగా ఆరు ప్లాస్టిక్ సంచుల్లో గంజాయిని గుర్తించారు. ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. గంజాయి, జీపును సీజ్ చేసి స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. నిందితుల నుంచి రూ.95 వేల నగదు, రెండు కీ ప్యాడ్ సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.3 లక్షలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన వారిలో ముంచంగిపుట్టు మండలం బూసిపుట్టు పంచాయతీ కేంద్రానికి చెందిన వంతాల గణపతి, జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన శత్రుఘున్ యాదవ్ ఉన్నారన్నారు. పరారైన ఐదుగురి వ్యక్తుల వివరాలను సేకరించి పట్టుకుంటామని ఎస్ఐ పేర్కొన్నారు. తనిఖీల్లో ఏఎస్ఐ తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ అలెర్ట్!

- విజయవాడ బస్సు ప్రమాదం నేపథ్యంలో చర్యలు
- 55 ఏళ్లు పైబడిన వారికి దగ్గర రూట్ల కేటాయింపు
- అద్దె/ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లకు రెండ్రోజులు శిక్షణ
- ప్రవర్తన, భద్రత పెంపుపై ప్రత్యేక తర్ఫీదు



ద్వారకా బస్‌స్టేషన్ పోర్టికో ప్రాంతం

సాక్షి, విశాఖపట్నం : విజయవాడ బస్టాండులో ఇటీవల జరిగిన బస్సు దుర్ఘటన నేపథ్యంలో ఆర్టీసీ అప్రమత్తమైంది. మళ్లీ అలాంటి ఘటనలు మరెక్కడా జరగకుండా తగిన చర్యలు తీసుకుంటోంది. 55 ఏళ్లు పైబడిన, అనారోగ్య సమస్యలున్న డ్రైవర్లను దూర ప్రాంత సర్వీసులకు పంపకూడదని ఆర్టీసీ ఉన్నతాధికారులు నిర్ణయించారు. దూర ప్రాంతాలు వెళ్లే సర్వీసుల్లో ఎక్కువగా రాత్రి విధులు కూడా నిర్వహించాల్సి ఉంటుంది. దీనివల్ల ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందన్న భావనతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఇలాంటి వారిలో ఆరోగ్యంగా ఉన్న వారి నుంచి అంగీకారం తీసుకుని పగటి పూట నడిచే దగ్గర రూటు ఎక్స్‌ప్రెస్ బస్సులకు, సిటీ బస్సులకు కేటాయిస్తారు. వారి స్థానంలో 55 సంవత్సరాల లోపు వయసు, ఆరోగ్యంతో ఉన్న డ్రైవర్లను, యువ డ్రైవర్లను పంపనున్నారు. ఇలా విశాఖపట్నం డిపో పరిధిలో 55 ఏళ్లు పైబడిన డ్రైవర్లు 30 మంది వరకు ఉన్నారు. ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న డ్రైవర్లను అత్యవసర సమయాల్లో దూర ప్రాంత సర్వీసులకు పంపేవారు. కానీ ఇప్పుడు అలాంటి వారిని సర్వీసులకు పంపడం లేదు. సాధారణంగా సీనియర్ డ్రైవర్లు దూర ప్రాంత సర్వీసులకే తప్ప దగ్గర రూటు/సిటీ బస్సుల్లో విధులు నిర్వహించడానికి ఆసక్తి చూపరు. అయితే విజయవాడ బస్సు ప్రమాదంతో ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఇటువంటి నిర్ణయాలు తీసుకున్నారు.

ఆ డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ

సాధారణంగా బస్సు చిన్నపాటి ప్రమాదానికి గురైనా సంబంధిత బస్సు డ్రైవర్‌కు ఆర్టీసీలో శిక్షణకు పంపిస్తుంటారు. విజయవాడ బస్సు ప్రమాదం నేపథ్యంలో ఔట్‌సోర్సింగ్, అద్దె బస్సుల డ్రైవర్లకు రెండు రోజుల పాటు విజయనగరంలో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. వారం రోజుల్లో ఈ శిక్షణను ప్రారంభించనున్నారు. ఇందులో ఒక పూట థియరీ, మరో పూట నిపుణుల సమక్షంలో డ్రైవింగ్ పరిశీలన ఉంటుంది. ప్రమాదాల నివారణపై మెళకువలను నేర్పిస్తారు. విశాఖ జిల్లాలో 260 మంది అద్దె బస్సు డ్రైవర్లు, 140 మంది వరకు ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు ఉన్నారు. వీరందరికీ దశల వారీగా విజయనగరంలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే ప్రయాణికుల పట్ల ఆర్టీసీ డ్రైవర్ల ప్రవర్తనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఇలాంటి వారు సత్ప్రవర్తనతో మెలిగేలా నిపుణులు కౌన్సెలింగ్ ఇవ్వనున్నారు.

డీబీఎస్‌లో కాంక్రీట్ స్టాపర్లు

మరోవైపు విజయవాడలో బస్సు అదుపు తప్పి ప్లాట్‌ఫాంపైకి దూసుకెళ్లిన దుర్ఘటనలో ముగ్గురు మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. దీంతో అటువంటి ప్రమాదాలకు తావులేకుండా విశాఖ ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇదివరకే ద్వారకా బస్‌స్టేషన్ (డీబీఎస్)లో ప్లాట్‌ఫాంల వద్ద కాంక్రీట్ స్టాపర్లను ఏర్పాటు చేశారు. ఏదైనా బస్సు అదుపు తప్పి దూసుకొస్తే ప్లాట్‌ఫాంపైకి వెళ్లకుండా ఈ స్టాపర్లు అడ్డుకుంటాయి. ఇప్పుడు తాజాగా డీబీఎస్ పోర్టికో ప్రాంతంలోనూ కాంక్రీట్ స్టాపర్లను ఏర్పాటు చేయనున్నట్టు ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు.

పౌష్టికాహారాన్ని సక్రమంగా అందజేయాలి

హుకుంపేట: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి అన్నారు. మండలంలోని తాడిపుట్టు, దిగుడుపుట్టు, బొండలమామిడి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో రికార్డులు పరిశీలించారు. బాలింతలు, గర్భిణిలకు, చిన్నారులకు అందిస్తున్న పోషకాహార వివరాలపై ఆరాతీశారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం నాణ్యమైన పోషకాహారాలు పంపిణీ చేస్తోందని, వాటిని సక్రమంగా అందించాలని తెలిపారు. అనంతరం పెదగరువు ప్రభుత్వ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల, మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సందర్శించారు. సీడీపీవో బాలచంద్రమణి దేవి, ప్రిన్సిపాల్ సింహాచలంనాయుడు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల మెరుగైన సేవలు లక్ష్యం

- 9వేల మందికి ప్రత్యేక శిక్షణ
- కలెక్టర్ సుమిత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలోని అన్ని సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు.బుధవారం తన కార్యాలయం నుంచి జిల్లాలోని ఎంపీడీవోలతో వీడియో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 352 సచివాలయాల పరిధిలో 5,700మంది వలంటీర్లు, 3,200మంది సచివాలయాల ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాలను చేపట్టాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ కార్యక్రమాల అమలు, ఫేసియల్ హాజరు, సచివాలయాల నిర్వహణ, ప్రజలకు అందించాల్సిన నాణ్యమైన సేవలు తదితర అంశాలపై సమగ్ర శిక్షణకు షెడ్యూల్ తయారు చేయాలని సూచించారు. మూడు రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాలకు గాను అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. ఈనెల 21 నుంచి డిశంబర్ 20 వరకు శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయని, ఒక్కో బ్యాచ్‌కు 3రోజుల శిక్షణ ఉంటుందన్నారు.వీఆర్వోలు, వీఆర్ఏలను కూడా శిక్షణలో చేర్చాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, డివిజనల్ అభివృద్ధి అధికారి శాంతకుమారి, హెల్త్‌ఫుల్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

10న దివ్యాంగులకు ప్రత్యేక జాబ్ మేళా

మధురవాడ: జిల్లా ఉపాధి కార్యాలయం, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ సంయుక్త ఆధ్వర్యంలో యూత్ ఫర్ జాబ్స్ సంస్థ సహకారంతో ఈ నెల 10న దివ్యాంగులకు ప్రత్యేక జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు జిల్లా ఉపాధి అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి, విభిన్న ప్రతిభా వంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు జి. మాధవి ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు 10 గంటలకు లంకలపల్లి బుల్లయ్య కాలేజీలో జరిగే మేళాలో అమెజాన్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ట్రాన్స్‌ఫోర్టేషన్ క్వాలిటీ స్పెషలిస్ట్(సాఫ్ట్‌వేర్) ఉద్యోగాలు భర్తీ చేస్తారన్నారు. ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించి.. ఎంఎస్ ఆఫీస్ సర్టిఫికెట్, ఇంగ్లిష్ నైపుణ్యాలు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన వారు హైదరాబాద్‌లో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు https:// www. ncs. gov. in/లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

వైద్యాధికారులు నిత్యం అందుబాటులో ఉండాలి

ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



సీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: వైద్యాధికారులు నిత్యం రోగులకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని విశాఖ ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. స్థానిక సీహెచ్‌సీను బుధవారం రాత్రి 7గంటలకు చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులకు వెళ్లి రోగులతో మాట్లాడి, అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. సీహెచ్‌సీలో రిక్డాలను పరిశీలించారు. విధుల్లో ఉండాల్సిన వైద్యాధికారి అందుబాటులో లేకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎటువంటి సమాచారం లేకుండా ఇష్టానుసారంగా వైద్యాధికారులు విధులకు డుమ్మా కొడితే సహించేది లేదని హెచ్చరించారు. 23 పంచాయతీల్లో 372 గ్రామాలకు ప్రధాన దిక్కు అయినా ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో వైద్యాధికారులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని ఆమె అన్నారు.

ఆకట్టుకున్న బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు

- రాష్ట్ర స్థాయి పోటీలకు ఏడు ప్రాజెక్టుల ఎంపిక



సైన్స్ ప్రాజెక్టు విశేషాలను వివరిస్తున్న విద్యార్థులు

గాజువాక : జిల్లా విద్యాశాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో గాజువాకలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో ప్రదర్శనకు ఉంచిన ఏడు ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన 31వ జాతీయ బాలల సైన్స్‌కాంగ్రెస్-2023 జిల్లా స్థాయి పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 273 ప్రాజెక్టులను ప్రదర్శించారు. వాటి నుంచి ఎంపిక చేసిన ఏడు ప్రాజెక్టులను ఈ నెల 29, 30 తేదీల్లో విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రదర్శించనున్నట్టు జిల్లా స్థాయి పోటీల నిర్వాహకులు తెలిపారు.

సృజనకు వేదిక

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇటువంటి పోటీలు మంచి వేదిక అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. పోటీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా ఇలాంటి పోటీల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం అలవడుతుందన్నారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష అభియాన్ కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ఎంఈవో జి.సునీత, ఆప్‌కాస్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ పి.రాజారావు, 67వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పల్లా చినతల్లి, గాజువాక హైస్కూల్ జిల్లా ప్రధానోపాధ్యాయిని కె.విజయ ప్రశాంతి, పాఠశాల విద్యా కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మీభాయి, ఆప్‌కాస్ట్ అకడమిక్ సమన్వయకర్త బి.ఎస్.మూర్తి, సైన్స్ ఆఫీసర్ కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకర్షిత నగరం.. విశాఖ

- కార్మెల్ సిటీ మేయర్ జేమ్స్ బ్రెనార్డ్
- ఆర్కే బీచ్‌లో స్వచ్ఛత ఎకో అవార్డుల ప్రారంభోత్సవం



మాట్లాడుతున్న కార్మెల్ సిటీ మేయర్ జేమ్స్ బ్రెనార్డ్

బీచ్ రోడ్డు: విశాఖ అందర్నీ ఆకట్టుకునే ఆకర్షిత నగరమని, ఇతర దేశాలకు ఆదర్శంగా ఉందని అమెరికాకు చెందిన కార్మెల్ సిటీ మేయర్ జేమ్స్ బ్రెనార్డ్ కితాబునిచ్చారు. బుధవారం ఉదయం జీవీఎంసీ ఆధ్వర్యంలో ఆర్కే బీచ్‌లోని కాళీమాత ఆలయం వద్ద 'స్వచ్ఛత ఎకో అవార్డుల ప్రారంభోత్సవం', 'స్వచ్ఛ దీపావళి సిగ్నేచర్ క్యాంపైన్'నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారితో కలిసి జేమ్స్ స్వచ్ఛత ఎకో-వైజాగ్ అవార్డు లోగో, బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాఖ నగరం ప్రకృతి పరంగా పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోందన్నారు. జీవీఎంసీ అమలు చేస్తున్న స్వచ్ఛత ఎకో వైజాగ్ కార్యక్రమాలతో విశాఖకు దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో కూడా గుర్తింపు వస్తుందన్నారు. మేయర్ గొలగాని మాట్లాడుతూ మన విశాఖను ప్రపంచంలోనే అత్యున్నతమైన ప్రమాణాల కలిగిన పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన కార్యక్రమమే ఎకో-వైజాగ్ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖను పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు అనేక చర్యలు చేపట్టారని చెప్పారు. ఇందులో భాగంగా జీవీఎంసీ పరిధిలో ఆరోగ్యవంతమైన పోటీతత్వాన్ని పెంపొందించి స్వచ్ఛ వార్డులుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. థర్డ్ పార్టీ ఏజెన్సీస్ ద్వారా సర్వే నిర్వహించిన అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వార్డులకు వరుసగా రూ.20 లక్షలు, రూ.10 లక్షలు, రూ.5 లక్షలు నగదు బహుమతులు అందిస్తామని చెప్పారు. ఆ నగదు బహుమతులను ఆయా వార్డుల అభివృద్ధికి వినియోగించనున్నామన్నారు. మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ మార్గదర్శకాల ప్రకారం కాలుష్య రహితంగా, ప్లాస్టిక్ రహితంగా, పర్యావరణ హితమైన వస్తువులతో హరిత దీపావళిని జరుపుకోవాలన్నారు.